



ఏం చేద్దాం?

● పార్టీ నేతలతో విజయ్ మంతనాలు

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనపై సుప్రీంకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధ్యక్షుడు విజయ్ భవిష్యత్ కార్యాచరణపై దృష్టిసారించారు. గత పక్షం రోజులుగా అరెస్టుకు భయపడి అజ్ఞాతంలో గడిపిన ఆ పార్టీ నేతలంతా ప్రస్తుతం పయనూర్‌లోని పార్టీ కార్యాలయానికి వస్తున్నారు. ఆ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్ మంగళవారం ఉదయం విజయ్‌తో భేటీ అయ్యారు. కరూర్ దుర్ఘటన అనంతరం కొంత డీలాపడిన ఆ పార్టీ నేతలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. దీనికి తోడు మద్రాస్ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలతో టీవీకే నేతలు ఇరుకునపడినట్లయింది. అయితే ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తుకు సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ఆ పార్టీ నేతలు కాస్త ఊపిరి పీల్చుకున్నట్లు కనిపిస్తోంది. మంగళవారం వేకువజామునే టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్ పార్టీ నేత విజయ్‌ని ఆయన నివాసంలో కలిసారు. మంగళవారం మధ్యాహ్నం వరకూ విజయ్ పార్టీ ప్రముఖులతో పాటు, సీనియర్ న్యాయవాదులతోనూ చర్చించారు. ఈ నెల 17న కరూర్ వెళ్ళి మృతుల కుటుంబీకులను పరామర్శించేందుకు విజయ్ సిద్ధమవుతున్న విషయంపై కూడా చర్చించారు. విజయ్ కరూర్ పర్యటన సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు చర్చించుకున్నట్లు సమాచారం. ఘటన అనంతరం విజయ్ బాధితులను పరామర్శించకపోవడంతో ఆ పార్టీ విమర్శలు ఎదుర్కొంటోంది. దీంతో సాధ్యమైనంత త్వరగా విజయ్ బాధితులను పరామర్శించడం మంచిదని నేతలంతా విజయ్‌కు సూచించినట్లు సమాచారం. అయితే పోలీసుల నుంచి అనుమతి రాకపోతే ఏం చేయాలన్నదానిపైనా నేతలు చర్చించినట్లు తెలిసింది. అంతేగాక ఇకపై పార్టీ సభలు, ప్రచార కార్యక్రమాలకు సమయపాలన పాటించేలా వ్యూహకర్తలు ప్రణాళికలు రూపొందించాలని కూడా వారు ఈ సందర్భంగా సూచించారు.

దీపావళి రోజు రెండు గంటలే టపాసులు కాల్చాలి

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి రోజున రెండు గంటలు మాత్రమే టపాసులు కాల్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు సచివాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... దీపావళి పండుగలో భాగంగా పిల్లల నుంచి పెద్దల వరకు టపాసులు కాల్చేందుకు ఇష్టపడతారని తెలిపింది. అదే సమయంలో, పర్యావరణ, శబ్ధ కాలుష్య నివారణ కూడా ప్రతి ఒక్కరి కర్తవ్యమని తెలిపింది. ఆ వ్యవహారంపై సుప్రీం కోర్టు ఉత్తర్వులతో.. 2018 నుంచి దీపావళి పండుగ రోజున ఉదయం 6 నుంచి 7 గంటలు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చేందుకు అనుమతిస్తున్నట్లు తెలిపింది. ఆ ప్రకారం, ఈ ఏడాది దీపావళి పండుగ రోజున కూడా ఉదయం గంట, రాత్రి ఒక గంట మాత్రమే టపాలసులు కాల్చాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.



మృతులకు సంతాపం తెలుపుతూ మౌనం పాటిస్తున్న స్పీకర్ అప్పావు, సీఎం స్టాలిన్ సహా సభ్యులు

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

● ఇల గణేశన్ సహా ప్రముఖుల మృతికి సంతాపం ● కరూర్ మృతులకు నివాళి

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు మంగళవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యాయి. తొలిరోజు సమావేశానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), మంత్రులు. శాసనసభ్యులు హాజరయ్యారు. నాగాలాండ్ గవర్నర్ ఇల గణేశన్ సహా ప్రముఖుల మృతికి నివాళులర్పించిన అనంతరం సమావేశం బుధవారానికి వాయిదా పడింది. సమావేశం ప్రారంభం కాగానే ముందుగా స్పీకర్ అప్పావు ఎనిమిదిమంది మాజీ ఎమ్మెల్యేల మృతికి సంతాప తీర్మాణం చదివి వినిపించారు. మాజీ ఎమ్మెల్యేలు పురట్చి మణి, గుణశేఖరన్, గోవిందసామి, అమర్‌నాథ్, అరివళగన్, దురై అన్బరసన్ అలియాస్ రామలింగం, కవింజర్ రెహ్మాన్, ఇరా చిన్నసామి మృతికి సంతాప సూచకంగా సభ్యులంతా లేచి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఆ తరువాత కరూర్‌లో సెప్టెంబర్ 27 రాత్రి జరిగిన టీవీకే రోడ్‌షోలో 41 మంది మృతికి సంతాప తీర్మానాన్ని స్పీకర్ అప్పావు చదివారు. కరూర్‌లో తొక్కిసలాటలో 41 మంది మృతి చెందినట్లు తెలియగానే ముఖ్యమంత్రి స్టాలిన్ వెంటనే ఆ ప్రాంతానికి వెళ్ళి మృతుల కుటుంబాలను పరామర్శించి, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారిని ఓదార్చారని, ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయాన్ని కూడా ప్రకటించారన్నారు. తొక్కిసలాటలో మృతి చెందిన 41 మందికి నివాళులర్పించేలా సభ్యులంతా లేచి రెండు నిమిషాలపాటు మౌనం పాటించాలని స్పీకర్ అప్పావు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు సీఎం స్టాలిన్, అన్నాడీఎంకే సభాపక్ష నాయకుడు ఈపీఎస్, మంత్రులు, శాసన సభ్యులు లేచి నిలిచి మౌనం పాటించారు.

కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కూ...

నాగాలాండ్ మాజీ గవర్నర్ ఇల గణేశన్, కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్, జార్ఖండ్ మాజీ సీఎం శిబు సోరన్, సీపీఐ జాతీయ కమిటీ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, రాష్ట్ర ఆరోగ్యశాఖ మాజీ కార్యదర్శి బీలా వెంకటేశన్, సిట్టింగ్ ఎమ్మెల్యే అముల్ కందసామి మృతి పట్ల సంతాప తీర్మానాన్ని స్పీకర్ అప్పావు చదివారు. వీరి మృతికి సంతాపసూచకంగా సభ్యులంతా మౌనం పాటించారు. ఆ తర్వాత స్పీకర్ అప్పావు సభ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం ఉదయం నుండి శాసనసభలో కరూర్ దుర్ఘటన, కోల్డ్రిఫ్ దగ్గు మందు కంపెనీ వ్యవహారం తదితర కీలకమైన అంశాలపై ప్రధాన ప్రతిపక్షాలు ధ్వజమెత్తనున్నాయి. బుధవారం ఉద యం ప్రశ్నోత్తరాల సమయం ముగియగానే 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను అదనపు వ్యయానికి సంబంధించిన ఆర్థిక అనుబంధ పద్దులపై ప్రతిపాదనలు దాఖలవుతాయి. ఈ పద్దులపై ఈ నెల 16న చర్చలు జరుగనున్నాయి. 17న ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు సభ్యులు లేవనెత్తిన అంశాలపై సమాధానాలు తెలిపేలా ప్రసంగించనున్నారు. ఆ తర్వాత ఆర్థిక అనుబంధ బిల్లులన్నీ సభామోదం పొందనున్నాయి.

హైకోర్టు న్యాయమూర్తి నిషా బాను బదిలీ

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.నిషా బాను కేరళ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఆమెను కేరళ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. దానిని పరిశీలించిన కేంద్రప్రభుత్వం.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించగా, దానిని ఆమె ఆమోదించారు. ఈ మేరకు ఆమెను కేరళ హైకోర్టుకు బదిలీ చేస్తున్నట్లు కేంద్ర న్యాయ శాఖ సంయుక్త కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

● దీపావళి సీజన్ ....

ఈరోడ్‌లో రూ.7 కోట్ల వస్త్ర వ్యాపారం

అడయార్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని ఈరోడ్ వారాంతపు సంతలో రూ.7 కోట్ల మేర వస్త్ర వ్యాపారం జరిగింది. ఈ జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం రాత్రి వారాంతపు వస్త్ర సంత నిర్వహిస్తుంటారు. దక్షిణ భారతదేశంలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన ఈ సంతకు పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వస్త్ర వ్యాపారులు వచ్చి తమకు కావాల్సిన దుస్తులను భారీ మొత్తంలో కొనుగోలు చేస్తుంటారు. ఆ ప్రకారంగా సోమవారం రాత్రి జరిగిన ఈ సంతలో ఏకంగా రూ.7 కోట్ల మేర వస్త్ర వ్యాపారం జరిగిందని స్థానిక వ్యాపారులు వెల్లడించారు. దీపావళి పండుగకు మరో ఐదు రోజులే ఉన్న నేపథ్యంలో ఈ వారంతపు సంతకు కొనుగోలుదారులు పోటెత్తారు. ఒక్క రోజే హోల్‌సేల్ వ్యాపారం 50 శాతం, చిల్లర వ్యాపారంగా 60 శాతం మేరకు జరిగినట్టు వ్యాపారులు వెల్లడించారు.

117వ వసంతంలోకి ఊటీ కొండ రైలు



● నేడు రైల్వే స్టేషన్‌లో వేడుకలు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పచ్చటి ప్రకృతి, రమణీయమైన కొండల సోయగాల నడుమ నడిచే నీలగిరి జిల్లా ఊటీ కొండ రైలు బుధవారం 117వ వసంతంలోకి అడుగుపెట్టనుంది. ఈ సందర్భంగా ఊటీ రైల్వేస్టేషన్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరపాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. నిజానికి కొండ రైలును 120 సంవత్సరాల క్రితం మేట్టుపాళయం-కున్నూర్ మధ్య ప్రారంభించారు. తొమ్మిది సంవత్సరాల అనంతరం కున్నూర్ నుంచి ఊటీ సమీపంలోని ఫెర్న్‌హిల్ అనే ప్రాంతం వరకు విస్తరించారు. అనంతరం 1909 అక్టోబరు 15న ఊటీలో రైల్వేస్టేషన్ ఏర్పాటుచేసి, కొండ రైలును ఊటీ వరకు పొడిగించారు. ఈ రైలు ఆసియా ఖండంలో అతి పొడవైన మీటర్ గేజ్ కొండ రైలుగా పేరొందింది. ప్రస్తుతం కున్నూర్‌లోని వర్క్‌షాప్ దక్షిణ రైల్వేలో ఉన్న ఏకైక ఆవిరి లోకోమోటివ్ వర్క్‌షాప్‌గా నిలిచింది. ఈ వర్క్‌షాప్ 1899లో ప్రారంభించారు. మేట్టుపాళయం-కున్నూర్ మధ్య నడిపే ఆవిరి లోకోమోటివ్‌ను స్విట్జర్లాండ్ నుంచి దిగుమతి చేసుకుని, ఈ వర్క్ షాప్‌లో పర్యవేక్షిస్తున్నారు.

ఆసియాలోనే ఏటవాలు రైల్వే లైన్...

మేట్టుపాళయం-కున్నూర్ మధ్య రైల్వే లెన్ ఆసియాలోనే అత్యంత ఏటవాలుగా ఉంటుంది. ఈ కారణంగా, రైలును కాగ్ వీల్ సహాయంతో నడుపుతున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వందేళ్లుగా సేవలందించిన ఆవిరి లోకోమోటివ్‌కు విశ్రాంతి కల్పించి, ఊటీ-కున్నూర్ మధ్య డీజిల్ లోకోమోటివ్ ప్రారంభించారు. 11,516 మీటర్ల పొడవు, 2.15 మీటర్ల వెడల్పుతో కూడిన 4 బోగీల కొండ రైలు నడుపుతున్నారు. మేట్టుపాళయం- ఊటీ (46 కి.మీ) మధ్య 208 మలుపులు, 250 వంతెనలు, 16 సొరంగాల గుండా కొండ రైలు వెళ్తుంది. రైల్వే శాఖ, నీలగిరి హెరిటేజ్ రైల్వే ప్రిజర్వేషన్ సొసైటీ నీలగిరి కొండ రైలును ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించాలని కోరాయి. 2005 జూలై 15న డర్బన్‌లో జరిగిన 29వ ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదన ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆ ప్రకారం, నీలగిరి కొండ రైలును యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించింది. ఫలితంగా, రైల్వేస్టేషన్, కొండ రైలు ప్రపంచ పర్యాటక పటంలో స్థానం పొందాయి.

తలైవరే! ఆరోగ్యం ఎలా ఉంది?

● అసెంబ్లీ లాబీలో దురైమురుగన్‌కు ఈపీఎస్ పరామర్శ

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నిత్యం విమర్శలు, ప్రతి విమర్శలతో విరుచుకుపడే అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్),రాష్ట్ర నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్‌తో మాట్లాడారు.మంగళవారం శాసనసభ సమావేశాలు వాయిదా పడగానే..మంత్రులు,ఎమ్మెల్యేలంతా హాలు నుంచి బయటకు వెళ్లిపోయారు. అదే సమయంలో సీనియర్ మంత్రి దురైమురుగన్ నడచుకుంటూ బయటకు వస్తుండగా, ఈపీఎస్‌తో ఆయనతో అడుగులు కలిపారు.'తలైవరే! ఆరోగ్యం ఎలా వుంది? వైద్యం తీసుకుంటున్నారా?' అంటూ పరామర్శించారు. అందుకు దురైమురుగన్ బదులిస్తూ.. ప్రస్తుతం తన ఆరోగ్యం బాగానే వుందని తెలిపారు. ఇద్దరు నేతలు రెండు నిమిషాల పాటు నిలబడి పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారిద్దరు సన్నిహితంగా మాట్లాడుకోవడాన్ని చూసి వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



అసెంబ్లీ సమావేశాలకు వచ్చిన అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు

పీఎంకే శాసనసభాపక్ష నేతగా జీకే మణిని తొలగించండి

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మెజారిటీ సభ్యుల ప్రతిపాదన మేరకు పీఎంకే శాసనసభా పక్ష నేత పదవి నుండి జీకే మణిని తొలగించాలని డిమాండ్ చేస్తూ డాక్టర్ అన్బుమణి వర్గానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ధర్నా చేశారు. శాసనసభలో పీఎంకేకు ఐదుగురు శాసనసభ్యులున్నారు. వీరిలో మయిలం ఎమ్మెల్యే శివకుమార్, మేట్టూరు ఎమ్మెల్యే సదాశివం, ధర్మపురి ఎమ్మెల్యే వెంకటేశ్వరన్ డాక్టర్ అన్బుమణికి మద్దతిస్తున్నారు. జీకే మణి, అరుళ్ పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ మద్దతుదారులుగా ఉన్నారు. అన్బుమణి వర్గానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఇటీవల స్పీకర్ అప్పావును కలిసి జీకే మణిని పీఎంకే శాసన సభాపక్ష నాయకుడి పదవి నుంచి తొలగించాలని పట్టుబట్టారు. పీఎంకే సభా నాయకుడిగా, ఉపనాయకుడిగా, విప్‌గా శివకుమార్, సదాశివం, వెంకటేశన్ సంయుక్తంగా ఓ వినతిపత్రాన్ని స్పీకర్‌కు సమర్పించారు. మంగళవారం శాసనసభ

● అన్బుమణి వర్గం ఎమ్మెల్యేల ధర్నా

సమావేశాలు వాయిదా పడటంతో అన్బుమణి వర్గం పీఎంకే ఎమ్మెల్యేలు ముగ్గురూ అసెంబ్లీ నాలుగో గేటు వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు. జీకే మణిని పీఎంకే సభాపక్ష నాయకుడి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ వీరు నినాదాలు చేశారు.

పీఎంకే ధర్నా దురదృష్టకరం : జీకే మణి

తనను పార్టీ శాసనసభాపక్ష నేత పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ తమ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ధర్నా చేపట్టడంపై జీకే మణి స్పందించారు. ఆయన అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో తమ పార్టీ రెండు వర్గాలుగా వ్యవహరించడం దురదృష్టకరమైన ఘటనగా అభివర్ణించారు. పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ ఇప్పటి వరకు పార్టీలో ఎలాంటి ఉన్నత పదవులను చేపట్టలేదని, వన్నియార్ల సంక్షేమం కోసం తన జీవితాన్నే ధార పోశారని, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న ఆ నాయకుడి మనస్సుకు నొప్పి కలిగించేలా ముగ్గు రు ఎమ్మెల్యేలు ప్రవర్తించడం బాధాకరమన్నారు. ప్రస్తుత శాసనసభ పదవీ కాలం ఆరునెలల్లో పూర్తికానున్న తరుణంలో పీఎంకే సభా పక్ష నేత పదవి కోసం ముగ్గురు ఎమ్మెల్యేలు పాకులాడుతున్నారని, ఇందువల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. పార్టీకి సంబంధించిన అన్ని అధికారాలు రాందాస్‌కే ఉన్నాయని జీకే మణి స్పష్టం చేశారు.



అసెంబ్లీ నాలుగో గేట్ వద్ద ధర్నా చేస్తున్న పీఎంకే ఎమ్మెల్యేలు

విద్యతోనే దేశాభివృద్ధి

● వీఐటీ ఛాన్స్‌లర్ విశ్వనాథన్

వేలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని వీఐటీ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ తెలిపారు. వీఐటీ వర్సిటీలో మంగళవారం ఛాన్స్‌లర్ విశ్వనాథన్ మీడియాతో మాట్లాడుతూ... వీఐటీ యూనివర్శిటీ ప్రారంభించి 41 ఏళ్లు పూర్తయిందని, ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు వీఐటీ తరఫున స్కాలర్ షిప్‌లు అందిస్తున్నామన్నారు. ఆ ప్రకారం ఇప్పటివరకు ఉన్నత విద్యా ట్రస్ట్ తరఫున సుమారు 10వేల మంది విద్యార్థులకు రూ.2 కోట్ల వరకు స్కాలర్‌షిప్‌లు అందజేసినట్టు తెలిపారు. అలాగే, పెద్ద జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదవిన విద్యార్థులు, విద్యార్థినులను ఇద్దరు చొప్పున ఎంపిక చేసి ఉచిత బస, ఆహారం, విద్య అందిస్తున్నామన్నారు. అలాగే, చిన్న జిల్లాల విద్యార్థులకు కూడా ఉచిత విద్య అందించాలని నిర్ణయించామని తెలిపారు. స్మార్ట్ పథకం కింద విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. స్మార్ట్ పథకంలో చేరేందుకు ముందు ఓ విద్యార్థి తండ్రి ఆదాయం రూ.5 వేలు ఉండగా, వీఐటీలో చదువు ముగించిన సదరు విద్యార్థి ఆదాయం, తండ్రి కంటే 10 రెట్లు అధికంగా ఉంటుందని తెలిపారు. విద్య అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక వృద్ధి, వ్యక్తిగత ఆదాయం పెరుగుతుందన్నారు. విద్యావంతులవారీగా కేరళ మొదటి స్థానంలో ఉండగా, ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారిలో తమిళనాడు మొదటి స్థానంలో ఉందని ఛాన్స్‌లర్ విశ్వనాథన్ తెలిపారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న విశ్వనాథన్

సమాచార దృష్టి

21న కోయంబేడు మార్కెట్‌కు సెలవు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని ఈ నెల 21వ తేది కోయంబేడు మార్కెట్ పనిచేయదని ప్రకటించారు. ఈ ఏడాది దీపావళి పండుగను ఈ నెల 20వ తేది ప్రజలు జరుపుకోనున్నారు. పండుగ సందర్భంగా 20వ తేది (సోమవారం) సాయంత్రం 6 గంటల నుంచి 21వ తేది (మంగళవారం) సాయంత్రం 6 గంటల వరకు సెలవు ప్రకటిస్తున్నట్లు కోయంబేడు వ్యాపారుల సంఘం అధ్యక్షులు ఎస్ఎస్ ముత్తుకుమార్ ప్రకటన విడుదల చేశారు.

'నెట్' టైం టేబుల్ విడుదల

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరులో నిర్వహించనున్న 'నెట్' టైం టేబుల్‌ను ఎన్టీఏ విడుదల చేసింది. జాతీయ పరీక్షా ఏజెన్సీ (ఎన్టీఏ) ఈ ఏడాది రెండు సార్లు (జూన్, డిసెంబరు) ఆన్‌లైన్‌లో నెట్ నిర్వహిస్తోంది. ఆ ప్రకారం, రెండో విడత పరీక్ష నోటిఫికేషన్ ఎన్టీఏ ఇటీవల విడుదల చేయగా, ప్రస్తుతం పరీక్ష టైం టేబుల్‌ను విడుదలైంది. ఆ ప్రకారం, 83 పాఠ్యాంశాలకు చెందిన నెట్ డిసెంబరు 31 నుంచి జనవరి 7వ తేదివరకు వివిధ దశల్లో నిర్వహించనున్నారు. అభ్యర్థులు మరింత సమచారాన్ని ugc-net.nta.nic.in/www.nta.ac.in అనే వెబ్‌సైట్ ద్వారానే, సందేహాల నివృత్తికి 011-69227700/ 40759000 అనే నెంబర్లు సంప్రదించవచ్చని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

చెన్నై-సేలం విమాన సమయాల్లో మార్పు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చెన్నై-సేలం-చెన్నై మధ్య నడుపుతున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ విమాన వేళల్లో మార్పులు జరిగాయి. ప్రస్తుతం చెన్నై నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరే విమానం సాయంత్రం 5 గంటలకు సేలం చేరుకుంటుంది. మరుమార్గంలో, సేలం నుంచి సాయంత్రం 5.20 గంటలకు బయల్దేరి 6.10 గంటలకు చెన్నై చేరుకుంటుంది. ఈ రెండు విమాన సమయాలు ఈ నెల 26వ తేది నుంచి మార్పులు చేశారు. ఆ ప్రకారం, చెన్నై నుంచి మధ్యాహ్నం 2.10 గంటలకు బయల్దేరే విమానం 3.20 గంటలకు సేలం చేరుకుంటుంది. మరుమార్గంలో, సేలం నుంచి మధ్యాహ్నం 3.40 గంటలకు బయల్దేరి సాయంత్రం 4.55 గంటలకు చెన్నై చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

5,6 తేదీల్లో కలెక్టర్లు, పోలీసు అధికారుల మహానాడు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో నవంబరు 5,6 తేదీల్లో మహానాడు జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ప్రతి ఏడాది రెండు రోజులు జిల్లా కలెక్టర్లు, పోలీసుల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమావేశమవుతారని, ఈ సమావేశంలో శాంతి భద్రతలు, ప్రభుత్వ పథకాలు అమలు తదితరాలపై సమీక్ష నిర్వహిస్తారని తెలిపింది. ఈ నేపథ్యంలో సచివాలయంలోని నామక్కల్ కవిఞర్ భవనంలో నవంబరు 5,6 తేదీల్లో జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులతో సీఎం సమావేశం కానున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలు అందించిన కలెక్టర్లు, పోలీసు అధికారులకు ముఖ్యమంత్రి ప్రశంసాపత్రాలు అందజేస్తారని సచివాలయం తెలిపింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకువ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపింది.

అలమాది: కొడువళ్లి, మాగరాల్, కండిగై, సేతుపాక్కం, గురువాయల్, కారణి, అమ్మనాపాక్కం, రామాపురం.

పట్టాభిరామ్: ఆవడి చెక్‌పోస్ట్, ఎన్ఎం రోడ్డు, నందవన మేటూరు, కన్నికాపురం, తిరుమలైరాజాపురం, నెహ్రూ బజార్.

తిరుముల్లైవాయల్: తెండ్రల్ నగర్ ఈస్ట్ మరియు వెస్ట్, సరస్వతి నగర్ మెయిన్ రోడ్డు, జాక్ నగర్, యమున నగర్, వళ్లలార్ నగర్, మూర్తి నగర్ 4వ వీధి, అంబేడ్కర్ నగర్.

ఆవడి: కామరాజ్ నగర్,శివశక్తినగర్, 60 అడుగులరోడ్డు, 40అడుగుల రోడ్డు,జ్యోతి నగర్, నాగమ్మై నగర్, ఆంటోని నగర్, ఈఎస్ఐ అన్నానగర్.

మాంగాడు: ఆవడి రోడ్డు, మాజిలమ్ అవెన్యూ, పూంజోలై వీధి, ఎంఎస్ఎస్ నగర్, ఆడ్కో నగర్, మేట్టు వీధి, సిపాయి నగర్, తందై పెరియార్ నగర్, కామరాజ్ నగర్, మురుగపిళ్లై నగర్, గంగై అమ్మన్ ఆలయ వీధి, వినాయగ నగర్, గోరిమేడు బజార్ వీధి, కన్నాంపుల్లి చెట్టి వీధి, అమ్మన్ ఆలయ వీధి, కుండ్రత్తూర్ రోడ్డు.

ఎగ్మూర్: ఎగ్మూర్ హైరోడ్డు, గెంగురెడ్డి వీధి, వీరాస్వామి వీధి, పెరుమాళ్ రెడ్డి వీధి, కేపు రోడ్డు, జగతామ అమ్మాళ్ ఆలయ వీధి, ఎంఎస్ నగర్, చెట్‌పెట్.

పాంథియన్ రోడ్డు: మాంటియత్ రోడ్డు, యతిరాజ్ రోడ్డు, మార్షల్ రోడ్డు, మోతిలాల్ లాండ్, పాత కమిషనర్ ఆఫీస్, జడ్జి క్వార్టర్స్.

విక్రవాండి ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు హత్య ?

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపం ముండియంబాక్కం ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రి మరుగుదొడ్డిలో నవజాత శిశువును హతమార్చి బాలింత పరారైంది. ఆస్పత్రిలో ప్రసూతి వార్డు వెనుకవైపున్న మరుగుదొడ్డిని శుభ్రం చేసేందుకు పారిశుధ్య కార్మికులు వెళ్లినప్పుడు బొడ్డుదారం కూడా తెగని మగశిశువు మృతదేహం కనిపించింది. వెంటనే కార్మికులు ఆ విషయాన్ని ఆసుపత్రి సిబ్బందికి తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు విక్రవాండి పోలీసులు హుటాహుటిన అక్కడికిచేరుకుని శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ మగశిశువుకు జన్మనిచ్చి తల్లి లేదా ఆమె కుటుంబీకులు హతమార్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు ఆస్పత్రి ప్రసూతివార్డులో ప్రసవం కోసం చేరిన మహిళల వివరాల ద్వారా ఆ శిశువును హతమార్చి పరారైన వారి వివరాలను కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

హొగెనేకల్‌లో దోనెల సవారీకి అనుమతి

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం హొగెనేకల్ జలపాతం వద్ద నీటి ప్రవాహ వేగం తగ్గుముఖం పట్టడంతో మంగళవారం దోనెల సవారీకి అనుమతించారు. అదే సమయంలో జలపాతాల వద్ద పర్యాటకులు స్నానానికి వెళ్ళకూడదంటూ అధికారులు ఆంక్షలు విధించారు. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించనుండటంతో దక్షిణాది జిల్లాల్లో భారీ వర్షాలకు కురుస్తున్నాయి. ఇదే విధంగా కర్ణాటక - తమిళనాడు కావేరీ పరివాహక ప్రాంతాలైన అంజెట్టి, బిలిగుండ్లు, రాశిమణల్, కేరట్టి తదితర అటవీ ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురవటంతో హొగెనేకల్ జలపాతంలో జలాల పరిమాణం 24 ఘనపుటడుగులుగా నమోదైంది. మంగళవారం ఉదయం ఆ జలపాతంలో ఇన్‌ఫ్లో 20 వేలు వరకూ తగ్గింది. ప్రధాన జలపాతం, ఐవర్‌పాణీ, సినీఫాల్స్ జలపాతాల వద్ద జలాలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం ఆ జలపాతం వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనటం మూడు రోజుల విరామం తర్వాత పర్యాటకులు దోనెలలో సవారీ చేయడానికి అధికారులు అనుమతించారు.


హొగెనేకల్ జలపాతంలో దోనెల సవారీ చేస్తున్న పర్యాటకులు

కత్తితో దాడి చేసిన విద్యార్థికి టీసీ


పాఠశాలలో విచారణ జరుపుతున్న పోలీసులు

తిరుత్తణి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ ఆటలో విద్యార్థుల మధ్య జరిగిన వాగ్వాదంలో కత్తితో దాడికి పాల్పడిన ఘటనపై మంగళవారం పోలీసులు పాఠశాలలో విచారణ జరిపారు. తిరువళ్లూరు జిల్లా అరుంగలం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు సోమవారం కబడ్డీ ఆడుతున్న సమయంలో తరుణ్‌కుమార్, రాఘవేంద్ర అనే విద్యార్థుల మధ్య వాగ్వాదం నెలకొంది. అది కాస్త పెద్దదై పాఠశాల ప్రాంగణంలోని బాత్‌రూమ్‌ల వద్ద జరిగిన కొట్లాలో తరుణ్‌కుమార్ తనవద్దనున్న చిన్న కత్తితో దాడి చేశాడు. గాయపడిన రఘవేంద్రను ఉపాధ్యాయులు ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం ఉదయం పాఠశాలలో విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో, దాడికి పాల్పడిన తరుణ్‌కుమార్ తల్లి దండ్రులను పాఠశాలకు పిలిపించి విచారించారు. అనంతరం బాలుడికి టీసీ ఇస్తున్నట్టు జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి అముద ప్రకటించారు.

చెరువులా మారిన వేలూరు రోడ్లు


చెరువులా దర్శనమిస్తున్న గ్రీన్ సర్కిల్ సర్వీస్ రోడ్డు - ఇళ్లలో చేరిన నీరు

వేలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రీన్ సర్కిల్ చిన్న చెరువును తలపిస్తోంది. ఈ కారణంగా ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలో వర్షపు నీరు ప్రవేశించింది. ఇంట్లో రెండడుగుల మేర నీరు చేరడంతో ప్రజలు రాత్రి వేళ్ల నిద్రపోకుండా, బక్కెట్లతో నీటిని తొలగించారు. చెంబాక్కం ప్రాంతం నుంచి వర్షపు నీరు గ్రీన్ సర్కిల్ సర్వీస్ రోడ్డు మీదుగా చెరువును తలపిస్తోంది. రోడ్లపై నీరు చేరడంతో వాహనాలు వెళ్లలేకపోవడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. భారీవర్షాలు కురిసిన ప్రతిసారి ఇలాంటి పరిస్థితి తలెత్తుతోందని, ఈ విషయమై స్థానిక అధికారులను పలు మార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ట్యాంకర్ లారీల సమస్య పరిష్కారం

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్పీజీ ట్యాంకర్ లారీల ఒప్పందాన్ని వచ్చే ఏడాది మార్చి వరకు పొడగిస్తున్నట్లు చమురు సంస్థల తరుపున హామీ ఇవ్వడంతో, ఆ లారీల సమ్మెకు స్టే విధించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌కు మద్రాస్ హైకోర్టు ముక్తాయింపు పలికింది. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని ఐవోసీ, బీపీ, హెచ్‌పీ మురు సంస్థల ఫిల్లింగ్ స్టేషన్ల నుంచి వంట గ్యాస్ సిలిండర్లను తరలించే కాంట్రాక్ట్‌ను ఒప్పందం ద్వారా ఎల్పీజీ ట్యాంకర్ లారీల యజమానులు పొందారు. ఈ ఏడాదికి సంబంధించిన కాంట్రాక్ట్ ఈ నెలతో ముగియనున్న సందర్భంగా కాంట్రాక్ట్‌ను వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగించేలా డిమాండ్ చేస్తూ దక్షిణ మండల ఎల్పీజీ ట్యాంకర్ లారీల యజమానుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెకు స్టే విధించాలని కోరుతూ మూడు చమురు సంస్థల తరుపున మద్రాస్ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిలో ట్యాంకర్ లారీల సమ్మె కారణంగా వంటగ్యాస్ సిలిండర్లను పంపిణీకి సమస్యలు తలెత్తినట్లు తెలిపాయి. ఈ కేసు హైకోర్టు న్యాయమూర్తి దండపాణి ముందుకు విచారణకు రాగా ఎల్పీజీ ట్యాంకర్ లారీల యజమానులతో గత ఏడాదికి సంబంధించి కుదుర్చుకున్న ఒప్పందాన్ని 2026 మార్చి నెల వరకు కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చమురు సంస్థల తరుపున హాజరైన న్యాయమూర్తి ఏఆర్ఎల్ సుందరేశన్ తెలిపారు. అవసరమైతే కొత్త టెండర్ విధానాన్ని అమలుపరచడంపై పరిశీలించనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. దానిని ట్యాంకర్ లారీల సంఘాలు అంగీకరించడంతో వాటికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌కు న్యాయస్థానం ముత్తాయింపు పలికింది. ఒప్పందం ముగిసే వరకు మధ్యలో ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు, సమ్మెలు చేపట్టకూడదని ట్యాంకర్ లారీల యజమానులకు న్యాయస్థానం సూచించింది. ఇదిలా ఉండగా, చమురు సంస్థల హామీని అంగీకరించిన ట్యాంకర్ లారీ యజమానుల సంఘం సమ్మెను విరమించుకుంటున్నట్లు ప్రకటించింది.


'టాస్మాక్' విచారణపై స్టే కొనసాగింపు

● సుప్రీంకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ నిర్వహణలో మద్యం విక్రయిస్తున్న టాస్మాక్ సంస్థలో రూ.1000 కోట్ల మేర అవినీతి జరిగిందనే ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు విధించిన స్టే కొనసాగిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. టాస్మాక్ సంస్థలో పలు రకాలుగా మోసం జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదులందాయని ప్రకటించిన ఈడీ అధికారులు ఎగ్మూర్‌లోని టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో గత మార్చిలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇందులో రూ.1000 కోట్ల మేర టాస్మాక్ సంస్థలో అవినీతి జరిగినట్లు గుర్తించామని ఈడీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈడీ చర్యలపై స్టే విధించాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వం తరుపున, టాస్మాక్ సంస్థ తరుపున దాఖలు చేసిన పిటిషన్లను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు ఉత్తర్వులు, ఈడీ చర్యలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు ప్రభుత్వం, టాస్మాక్ సంస్థలు అప్పీలుకు వెళ్లాయి. ఈ కేసుపై విచారణ జరిగిన అత్యున్నత న్యాయస్థానం టాస్మాక్ అవినీతి ఫిర్యాదు కేసులో ఈడీ విచారణకు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మరోవైపు తమిళనాడు ప్రభుత్వ అపీలు కేసులో వివరణ కోరుతూ ఈడీకి నోటీసు ఇవ్వాలని గతంలో ఆదేశించింది. ఈ నేపథ్యంలో, ఈ కేసు మళ్లీ మంగళవారం సుప్రీంకోర్టులో సీజే జస్టిస్ బీఆర్ గవాయ్ ముందు విచారణకు రాగా, ఈడీ, తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్ సంస్థ తరుపు న్యాయవాదులు హాజరై వాదించారు. ఇరు తరుపు వాదనలు విన్న అనంతరం జస్టిస్ గవాయ్ ఈడీని ఉద్దేశించి "టాస్మాక్ సంస్థలో ఆకస్మిక తనిఖీలు చేయడం రాష్ట్రహక్కుల ఉల్లంఘన కాదా?" అని ప్రశ్నించారు. ఆ తర్వాత టాస్మాక్ అవినీతి కేసుపై గతంలో ఈడీ విచారణకు విధించిన స్టేను కొనసాగిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

భవనాల కూల్చివేతపై నిర్లక్ష్యమెందుకు?

● తిరుత్తణి ఆలయ అధికారులకు భక్తుల ఫిర్యాదు


శిథిలావస్థకు చేరుకున్న భవనాలను కూల్చివేస్తున్న దృశ్యం

తిరుత్తణి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయానికి ప్రతిరోజు రాష్ట్రంలోని పలు జిల్లాలు సహా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాల భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. కొండపైకి భక్తులు సులభంగా చేరుకునేలా ఉచిత రవాణా వసతులను ఆలయ కమిటీ నిర్వహణలో కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొండపై శిథిలావస్థకు చేరుకున్న పలు రకాల భవనాలను కూల్చివేసి వాటి స్థానంలో నూతన దుకాణాలు, వంటశాల తదితర గదులను నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.86కోట్లు కేటాయించింది. ఈ క్రమంలో విస్తృతంగా భవనాల కూల్చివేత పనుల్లో ఆలయ నిర్వాహకులు నిమగ్నమయ్యారు. ఇదిలా వుండగా, కూల్చివేత పనులు జరుగుతున్నట్లుగా ఆ ప్రాంగణాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదని, కూల్చివేత కారణంగా దుమ్ము, ధూళి భక్తులపై పడుతోందని మంగళవారం ఆలయ కమిటీ కి భక్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై భక్తులు మాట్లాడుతూ, ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకుండా పనులు ఎలా ప్రారంభిస్తారని, అనుకోని ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని, కనీసం దుమ్ము ఎగసిపడకుండా గ్రీన్‌మ్యాట్ కూడా ఏర్పాటు చేయకపోవడంపై జిల్లా హిందూ సంఘాల నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీని వెంటనే చర్యలు చేపట్టి ఆ ప్రాంతంలో గ్రీన్‌మ్యాట్‌లను ఏర్పాటు చేయాల్సిందిగా వారు డిమాండ్ చేశారు.

టీఎన్‌ఈబీ ఒప్పంద కార్మికుల ధర్నా


ధర్నాలో కార్మికులు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్‌ఈబీ) ఉద్యోగులు, ఒప్పంద కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అన్నాసాలైలోని విద్యుత్ బోర్డు కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో ఆ సంఘం నేతలు మాట్లాడుతూ... విద్యుత్ పంపిణీ రంగం, విద్యుత్ ప్లాంట్లలో సుమారు 6 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వారి ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి, పదేళ్లలో మృతిచెందిన 300 మంది కాంట్రాక్ట్ కార్మికుల వారసులకు ఉద్యోగం, ఆర్థిక ప్రయోజనాలు అందజేయాలి, పాత పింఛన్ విధానం అందజేయాలి తదితర కోర్కెలతో ధర్నా చేపట్టామన్నారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని, లేని పక్షంలో ధర్నాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

ధోని పిటిషన్ కొట్టివేయాలంటూ అప్పీలు

● తీర్పు వాయిదా వేసిన హైకోర్టు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తనకు వ్యతిరేకంగా రూ.100 కోట్ల పరువు నష్టం కోరుతూ క్రికెటర్ ధోని దాఖలుచేసిన కేసు, కొట్టివేయాలంటూ మాజీ ఐపీఎస్ అధికారి సంపత్‌కుమార్ వేసిన అప్పీలుపై తీర్పు తేది ప్రకటించకుండా మద్రాసు హైకోర్టు వాయిదావేసింది. ఐపీఎల్ బెట్టింగ్స్‌పై విచారణ జరిపిన మాజీ ఐపీఎస్ అధికారి సంపత్‌కుమార్, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ధోని బెట్టింగ్‌లకు పాల్పడినట్లు ఓ ప్రైవేటు చానల్ నిర్వహించిన చర్చా వేదికలో ఆరోపించారు. ఈ ఆరోపణలు తన పేరు, ప్రతిష్ఠలకు భంగం కలిగించాయంటూ, ఐపీఎస్ అధికారి సంపత్‌కుమార్, ప్రైవేటు ఛానల్‌కు వ్యతిరేకంగా రూ.100 కోట్ల పరువు నష్టం కేసును క్రికెటర్ ధోని, 2014లో మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ధోని పిటిషన్ నిరాకరించాలంటూ మాజీ ఐపీఎస్ అధికారి సంపత్ కుమార్ దాఖలుచేసిన అప్పీలు విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి, ఈ అప్పీలు అంగీకరిస్తే, ప్రధాన కేసు ముగించడానికి చాలా ఏళ్లు పడుతుందంటూ పిటిషన్ కొట్టివేశారు. ఈ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ సంపత్ కుమార్ దాఖలుచేసి అప్పీలు పిటిషన్ విచారించిన న్యాయమూర్తి జస్టిస్ సుబ్రమణ్యం, జస్టిస్ జ్యోతిరామన్‌లతో కూడిన ధర్మాసనం, కేసు తీర్పు తేది ప్రకటించకుండా వాయిదావేసింది.

ప్రమాదరహిత దీపావళిని జరుపుకుందాం...!


కంటి గాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రమాదరహిత దీపావళిని జరుపుకోవాలని పలువురు వక్తలు విద్యార్థులకు సూచించారు. టి.నగర్‌లోని రాధాత్రి నేత్రాలయం ఆధ్వర్యంలో మంగళవారం, బాణసంచా కాల్చే సమయంలో కళ్లకు ఏర్పడే గాయాలు, వాటికి చేయాల్సిన ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని 37 పాఠశాలలకు చెందిన 110 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాధాత్రి నేత్రాలయ మెడికల్ డైరెక్టర్ డా.వాసుమతి, టపాసులు కాల్చడం ద్వారా కళ్లకు జరిగే ప్రమాదాలను వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ డీజీపీ అర్చన రామసుందరం, లోక్‌పాల్ మాజీ సభ్యుడు డా.ప్రవీణ కృష్ణ సహా పలువురు పాల్గొన్నారు.

అధికారంలో భాగస్వామ్యం అడగాల్సిందే

● హైకమాండ్ ఇన్‌ఛార్జులతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి గెలిస్తే అధికారంలో భాగస్వామ్యం కోరాల్సిందేనంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ హైకమాండ్ ఇన్‌ఛార్జుల ఎదుట డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో రాయపేటలోని సత్యమూర్తి భవన్‌లో అధిష్టానం నియమించిన పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జులు గిరీష్ చోడాంకర్, సూరజ్ హెగ్డేతో మంగళవారం ఉదయం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. గత కొద్ది నెలలుగా పార్టీ సీనియర్ నేత కేఎస్ అళగిరి, ఎంపీలు మాణిక్కం ఠాగూర్, కార్తీ చిదంబరం అధికారంలో భాగస్వామ్యం కావాలంటూ బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగిన ఎమ్మెల్యేల సమావేశంలో అధికారంలో భాగస్వామ్యం కల్పించాల్సిందేనని, ఆ దిశగా కాంగ్రెస్ అధిష్టానం డీఎంకే నేతలతో చర్చించాలని సూచించారు. అంతే కాకుండా గతంలా 25 సీట్లతో సరిపెట్టుకోకుండా ఈ సారి 30 కంటే ఎక్కువ అడగాలని కూడా హైకమాండ్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి గిరీష్ చోడాంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని పార్టీ అధిష్టానవర్గానికి తెలియజేస్తానని, శాసనసభ ఎన్నికల కూటమికి సంబంధించి, బహిరంగంగా రాష్ట్ర కాంగ్రెస్ నేతలు మాట్లాడకూడదని, కూటమి వ్యవహారంలో ఢిల్లీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

ఇళయరాజా కార్యాలయం, సీమాన్ ఇంటికి బాంబు బెదిరింపు

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా కార్యాలయానికి, నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్ నివాసానికి బాంబు బెదిరింపులు రావటంతో పోలీసులు తనిఖీలు చేశారు. గుర్తు తెలియని వ్యక్తి డీజీపీ కార్యాలయానికి ఈమెయిల్ ద్వారా బెదరింపు సందేశం పంపాడు. దీంతో సోమవారం అర్ధరాత్రి పోలీసులు నీలాంగరైలోని సీమాన్ నివాసానికి బాంబ్‌స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వెళ్ళి తనిఖీలు జరిపారు. మెటల్ డిటెక్టర్లతో అన్ని గదులనూ తనిఖీ చేసి, చివరకు అది ఉత్తుత్తి బాంబు బెదరింపని నిర్ధారణ అయ్యింది. ఇదే విధంగా కోడంబాక్కం ఫ్లైఓవర్ సమీపంలో ఇళయరాజా మ్యూజిక్ స్టూడియో, ఆఫీస్‌లో బాంబులు పేలనున్నట్లు మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి డీజీపీ కార్యాలయానికి ఈమెయిల్ పంపాడు. దీంతో పోలీసులు ఇళయరాజా మ్యూజిక్ స్టూడియో కార్యాలయానికి వెళ్ళిన బాంబ్ స్క్వాడ్ తనిఖీ చేసి, చివరకు అది ఉత్తుత్తి బాంబు బెదరింపు అని నిర్ధారించారు.

రేబిస్‌తో బాలుడి మృతి

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కోవై మేట్టుపాళయం ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల బాలుడి రేబిస్ లక్షణాలతో మృతిచెందాడు. ఈ నెల 9న బాలుడు అస్వస్థతకు గురికావడంతో, తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు, అతడికి రేబిస్ సోకిందని నిర్ధారించి, మేట్టుపాళయం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఈ నెల 10న కోవై ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, సోమవారం మృతి చెందాడు. ఈ విషయమై జిల్లా ఆరోగ్య శాఖ అధికారి బాలుస్వామి మాట్లాడుతూ... కుక్క కరచిన తర్వాత బాలుడు చాలా రోజులుగా ఎవరికీ చెప్పలేదని, ఆరోగ్యం క్షీణించిన తర్వాతే ఆసుపత్రిలో చేరారని తెలిపారు.

పిడుగుపాటుకు సీపీఎం నేత మృతి

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు సీపీఎం నేత మృతిచెందిన ఘటన తిరువారూర్ జిల్లాలో చోటుచేసుకుంది. గుడవాసల్ తాలూకా మరుదువాంజేరి గ్రామానికి చెందిన అన్బళగన్ (61) సీపీఎం గుడవాసల్ ఉత్తరం యూనియన్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. సోమవారం తన పొలంలో వరి నాట్లు వేసేందుకు అన్బళగన్ వెళ్లాడు. ఆ సమయంలో, హఠాత్తుగా ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. సమీపంలో పడిన పిడుగుతో షాక్‌కు గురైన అన్బళగన్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ విషయమై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఖైదీ నుంచి సెల్‌ఫోన్, బ్యాటరీ స్వాధీనం

వేలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జైలులోని ఖైదీ నుంచి సెల్‌ఫోన్, బ్యాటరీని జైలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సత్తువాచేరి నెహ్రూ నగర్‌కు చెందిన మణికంఠన్‌కు లైంగిక వేధింపుల కేసులో న్యాయస్థానం, 20 ఏళ్ల జైలుశిక్ష విధించడంతో జనవరి 30వ తేది నుంచి వేలూరు కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. అలాగే, తిరునల్వేలి జిల్లాకు చెందిన పాండియన్‌కు హత్యకేసులో జీవిత ఖైదు విధించడంతో అతను వేలూరు జైల్లో బందీగా ఉన్నారు. వీరిద్దరు జైలు ప్రాంగణంలోని కార్పెంటరీ కేంద్రంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో, సోమవారం జైలు పోలీసులు ఖైదీలను తనిఖీ చేస్తుంగా, మణికంఠన్ వద్ద సెల్‌ఫోన్, బ్యాటరీ, కేబుల్ తదితరాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో, పాండియన్ తనకు సెల్‌ఫోన్ ఇచ్చి భద్రపరచమన్నాడని మణికంఠన్ పోలీసులకు తెలిపాడు. ఈ వ్యవహారంపై జైలు వార్డెన్ రత్నస్వామి ఫిర్యాదుతో బాగాయం పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

రూ.50లక్షల విలువైన మత్తు మాత్రలతో ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు మనవాలనగర్ ప్రాంతంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో చట్టవిరుద్ధంగా తరలిస్తున్న రూ.50లక్షల విలువైన మత్తు మాత్రలతో ఇద్దరు పట్టుపడ్డారు. తిరువళ్లూరు జిల్లా డీఎస్పీ తమిళరసి పర్యవేక్షణలో సోమవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. మనవాలనగర్‌లో అనుమానాస్పదంగా సంచరించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. విచారణలో వారు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన జావీద్ (40), కర్ణాటక రాష్ట్రానికి చెందిన ముస్సిన్ (28) అని తెలిసింది. వారి బ్యాగులను తనిఖీ చేసి రూ.50 లక్షల విలువైన 50గ్రాముల మత్తు మాత్రలను స్వాధీనం చేసుకుని కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రూ.20లక్షల హవాలా నగదు స్వాధీనం

● పుదుకోటలో చెన్నై యువకుడి అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పుదుకోటలో రూ.20లక్షల హవాలా నగదుతో పట్టుబడిన చెన్నై యువకుడిని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పుదుకోట పోలీసులు కరువేపిలయాన్ రైల్వేగేట్ ప్రాంతంలో మంగళవారం ఉదయం ఓ ఆమ్నీ బస్సు ఆపి ప్రయాణికుల లగేజీ తనిఖీ చేశారు. ఓ యువకుడి దగ్గరున్న సంచిలో రూ.20 లక్షల నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ యువకుడు చెన్నై తండయార్‌పేటకు చెందిన అమీర్‌హుసేన్ (24)అని తెలిసింది. హవాలా నగదును శ్రీలంకలోని తొండి ప్రాంతానికి తరలించేందుకు అతను యత్నించినట్లు తేలడంతో కోర్టులో హాజరుపరిచిన అనంతరం పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో ముగ్గురికి బెయిలు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసుకు సంబంధించి జైల్లో ఉన్న ముగ్గురికి చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు బెయిలు మంజూరు చేసింది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ గత ఏడాది జూలై 5న దారుణ హత్యకు గురయ్యాడు. దీనిపై సెంబియం పోలీసులు కేసు నమోదుచేసి ఏ1 నిందితుడు నాగేంద్రన్, పొన్నై బాలు సహా 27 మందిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు విదేశాల్లో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నారు. ఈ కేసు జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కార్తికేయన్ విచారిస్తున్నారు. ఈ క్రమంలో, ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసును మద్రాసు హైకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించడంతో, సీబీఐ విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో, ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో జైల్లో బందీలుగా ఉన్న సతీష్, శివ, హరిహరన్‌లకు చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు బెయిలు మంజూరు చేసింది. కాగా, ఈ కేసులో ఏ1 నిందితుడుగా ఉన్న నాగేంద్రన్ ఇటీవల మృతిచెందారు. అలాగే, నాగేంద్రన్ కుమారుడు అశ్వత్థామ కూడా జైలులో ఉండగా, ఆయన బెయిలు సోమవారంతో ముగిసిన నేపథ్యంలో, తండ్రి స్మారక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అశ్వత్థామకు ఈ నెల 28వ తేది వరకు ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు బెయిలు పొడిగించింది.

ఊత్తుకోట చెక్‌పోస్ట్‌లో ఏసీబీ దాడులు

● రూ.1.24 లక్షల స్వాధీనం

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట సమీపం అన్నానగర్ వద్ద వాహనాల చెక్‌పోస్టు వద్ద అవినీతి నిరోధక శాఖ అధికారులు మంగళవారం వేకువజాము ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఆ సందర్భంగా చెక్‌పోస్ట్ సిబ్బంది వాహనచోధకుల నుండి లంచంగా తీసుకున్న రూ.1.24లక్షల నగదు పట్టుబడింది. చెక్‌పోస్ట్‌లో సిబ్బంది లంచాలు తీసుకుంటున్నట్లు వాహన చోధకులు చేసిన ఫిర్యాదు మేరకు తిరువళ్లూరు నుంచి వెళ్ళిన ఏసీబీ డీఎస్పీ గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వేకువజామునే ఆ చెక్‌పోస్ట్‌లో సోదాలు చేశారు. టేబుల్ సొరుగులు, సిబ్బంది జేబుల్లో, పుస్తకాల మధ్య దాచిన రూ.1.24లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదుకు సంబంధించిన రసీదులు ఏవీ లేకపోవడంతో అది లంచం సొమ్ముగా నిర్ధారించిన ఏసీబీ అధికారులు వారిని విచారణ జరుపుతున్నారు.

'కుశస్థలి' ప్రవాహానికి కొట్టుకుపోయి వ్యక్తి మృతి

తిరుత్తణి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీవర్షాలకు పళ్లిపట్టు సమీపంలోని కుశస్థలి నదిలో ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో సామంతవాడ సహా పలు గ్రామాలకు వెళ్లే వంతెనలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ నేపథ్యంలో, పళ్లిపట్టు సమీపంలోని కుమారరాజుపేటలోని సెలూన్‌లో పనిచేస్తున్న వెలియకరం గ్రామానికి చెందిన గోవిందరాజు (56)అనే వ్యక్తి సోమవారం ఉదయం సెలూన్‌కు వెళ్లేందుకు వంతెనను దాటేందుకు యత్నించాడు. ఆ ప్రయత్నంలో ప్రవాహ ఉధృతి ఎక్కువ కావడంతో గోవిందరాజు వరదనీటిలో కొట్టుకుపోయాడు. గమనించిన స్థానికులు అతడి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సమీపంలోని మత్స్యకారుల సహాయంతో గోవిందరాజు కోసం నదిలో గాలించారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం గోవిందరాజు మృతదేహం పళ్లిపట్టులోని నదీ పరిసరాల్లోని ముళ్లపొదల్లో కనిపించింది. మృతదేహాన్ని బయటికి తీసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రతిభకు వయసు అడ్డంకి కాదు

● పూజా హెగ్డే

వెండితెరపై ప్రతిభను నిరూపించుకునేందుకు వయసు పెద్ద అడ్డంకి కాదని ప్రముఖ హీరోయిన్ పూజా హెగ్డే అంటున్నారు. తాజాగా ఆమె తన 35వ పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అభిమానులతో సామాజిక మాధ్యమం వేదికగా చిట్‌చాట్ నిర్వహించారు. '35 యేళ్ళు పూర్తి చేసుకున్నారు. ఇంకా ఎంత కాలం సినిమాల్లో నటిస్తారు' అడిగిన ప్రశ్నకు పూజా సమాధానమిస్తూ, ఇలా ప్రశ్నించేవారికి సమాధానం చెప్పేందుకు అనేక విషయాలున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే హీరోయిన్ల ప్రతిభకు వయసు అడ్డంకి కాదు. వయసు కొలమానంగా తీసుకుని ఏ ఒక్క దానిని తీర్మానించలేం. అందువల్ల హీరోయిన్లను ఇలాంటి ప్రశ్నలు అడగొద్దు' అంటూ సుతిమెత్తగా సమాధానమిచ్చారు. కాగా, 'ముగమూడి' చిత్రం ద్వారా తమిళ ఇండస్ట్రీకి పరిచయమైన పూజా హెగ్డే ఆ తర్వాత 'బీస్ట్', 'రెట్రో' వంటి హిట్ చిత్రాల్లో నటించారు. ఇటీవల 'కూలీ' సినిమాలో 'మోనికా...' అనే ప్రత్యేక గీతంలో తన అందచందాలతో ప్రేక్షకులను అలరించారు. ఈ పాట సూపర్‌హిట్ కావడంతో ఆమెకు మంచి క్రేజ్ వచ్చింది.

'డ్యూడ్' సినిమాతో దీపావళి జరుపుకోండి

● ప్రదీప్ రంగనాథన్



'డ్యూడ్' ఆడియో రిలీజ్ వేడుకలో చిత్ర బృందం

'డ్యూడ్' సినిమాతో దీపావళి పండుగ జరుపుకోవాలని, ఈ సినిమా అంత బాగా వచ్చిందని, ప్రతి ఒక్కరికీ నచ్చుతుందని ఆ చిత్ర హీరో ప్రదీప్ రంగనాథన్ అన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో డెబ్యూ డైరెక్టర్ కీర్తీశ్వరన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు, సీనియర్ నటీనటులు శరత్ కుమార్, రోహిణి తదితరులు నటించిన చిత్రం 'డ్యూడ్'. దీపావళి సందర్భంగా ఈ నెల 17వ తేదీ విడుదలకానుంది. దీంతో చిత్ర బృందం సోమవారం నగరంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఇందులో హీరో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించిన శరత్ కుమార్‌కు ధన్యవాదాలు. నేను చూస్తూ పెరిగిన నటీనటులతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఆనందంగా ఉంది. హీరోయిన్ మమితను ఇంతకుముందెన్నడూ చూడని పాత్రలో చూస్తారు. దర్శకుడు కీర్తీశ్వరన్ ఒక మంచి చిత్రాన్ని ఇచ్చారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు, ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ అర్చన కల్పాతికి ధన్యవాదాలు. చిత్ర దర్శకుడు కీర్తీశ్వరన్ మాట్లాడుతూ, 'నిర్మాతలకు ఈ కథ చెప్పినపుడు వారు వెంటనే సినిమా తీసేందుకు అంగీకరించారు. హీరో ప్రదీప్‌ను మరో వెర్షన్‌లో చూస్తారు. ఈ సినిమాలో ప్రేమ, యాక్షన్, కామెడీ, ఎమోషన్ ఇలా అన్నీ ఉన్నాయి. థియేటర్లలో చూసి ఆనందించండి' అని కోరారు. చిత్ర నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ మాట్లాడుతూ, 'ఇంత మంచి సినిమాను మాకిచ్చినందుకు దర్శకుడికి ధన్యవాదాలు. మా బ్యానరులో మమిత, సాయి అభ్యంకర్ పరిచయం కావడం సంతోషంగా ఉంది. తమిళంలో మాకు ఇది రెండో చిత్రం. తర్వాత హీరోయిన్ మమిత, నటుడు శరత్ కుమార్, నటి రోహిణి, నిర్మాత అర్చన తదితరులు ప్రసంగించారు.

హీరోగా 'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు

● సినిమా షూటింగ్ పూర్తి

'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు అభిషన్ జీవింత్ హీరోగా తెరకెక్కుతోన్న కొత్త చిత్రం షూటింగ్ కేవలం 35 రోజుల్లో పూర్తి చేసుకుంది. తన తొలి చిత్రంతోనే అభిషన్ జీవింత్ అనేక మంది అగ్రహీరోలు, ప్రముఖుల ప్రశంసలు అందుకున్న విషయం తెల్సిందే. అదేసమయంలో అభిషన్‌ను కథానాయకుడుగా చిత్రాన్ని నిర్మించేందుకు ఎంఆర్పీ ఎంటర్‌టైన్మెంట్ సహకారంతో జియాన్ ఫిలిమ్స్ నిర్మాత రజనీకాంత్ ముందుకు వచ్చారు. పలు చిత్రాలకు అసిస్టెంట్ దర్శకుడిగా పనిచేసిన మదన్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అభిషన్ సరసన అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించారు. చెన్నై, తిరుచ్చి తదితర ప్రాంతాల్లో కేవలం 35 రోజుల్లో షూటింగ్ పూర్తి చేసుకుంది. నేటి యువతను ఆకట్టుకునేలా ఒక ప్రేమకథా చిత్రంగా తెరకెక్కిస్తున్నారు. ఇపుడు సినిమా షూటింగ్ పూర్తికావడంతో పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను ప్రారంభించి, త్వరలోనే ఫస్ట్‌లుక్, టీజర్, ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేయనున్నారు.



షూటింగ్ పూర్తి చేసిన చిత్ర బృందం

సినిమాల్లో కృతజ్ఞత లేకుండా పోయింది

● సీనియర్ దర్శకుడు పేరరసు



సినిమాల్లో కృతజ్ఞత అనేది లేకుండా పోయిందని ప్రముఖ సీనియర్ దర్శకుడు, కోలీవుడ్ దర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి పేరరసు అన్నారు. నిర్మాత రామనాథన్ నిర్మాణంలో ఏటీ రాజీవ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాజా వీట్టు కన్నుకుట్టి'. ఆదిక్ సిలంబరసన్, తంబి శివన్, గాయంత్రి రెమా, అను కృష్ణ, వర్షిత తదితరులు నటించారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుకలో పేరరసు ముఖ్య అతిథిగా హాజరై రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నటించిన హీరోయిన్ చాలా అందంగా ఉన్నారు. పైగా స్క్రీన్‌పై ఎంతో అందంగా చూపించినందుకు కెమెరామెన్‌కు ఆమె థ్యాంక్స్ చెప్పారు. నేటి కాలంలో సినిమాలో నటించేందుకు అంగీకరించి, ఆ చిత్రం నిర్మాణం పూర్తయితే దర్శక నిర్మాతలను నటీనటులు పట్టించుకోవడం లేదు. అలాంటిది ఒక కెమెరామన్‌ను హీరోయిన్ ప్రశంసించడం ఆశ్చర్యంగా ఉంది. ప్రస్తుతం సినిమాలో కృతజ్ఞత అనేది లేకుండా పోయింది. కానీ, ఇలాంటి హీరోయిన్లు ఇండస్ట్రీలో ఇంకా ఉండటం, కళ్ళతో చూడటం చాలా సంతోషంగా ఉందన్నారు.

గిండి చిల్డ్రన్స్ పార్కులో 'సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం'



తాబేలు ఆకారంలో నమూనా

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి చిల్డ్రన్స్ పార్క్‌లో తాబేలు ఆకారంలో 'సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం' ఏర్పాటు చేసేందుకు అటవీ శాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రానికి అనుకుని ఉన్న బంగాళాఖాతంలో సముద్రపు తాబేళ్ల విస్తారంగా కనిపిస్తుంటాయి. ఈ తాబేళ్ల ప్రతి ఏడాది డిసెంబరు నుంచి ఏప్రిల్ వరకు తీరానికి గుడ్లు పెట్టేందుకు వస్తుంటాయి. తిరువళ్లూర్ నుంచి నాగపట్టణం వరకు వివిధ జిల్లాల తీరప్రాంతాల్లో ఆలివ్ రిడ్లీ తాబేళ్ల గుడ్లు పెట్టి వెళుతుంటాయి. ఈ గుడ్ల నక్కలు, పక్షులు తీసుకెళ్లడం, గుడ్డు నుంచి వచ్చే పిల్లలను పక్షులు తినివేస్తుండడంతో ఆలివ్ రిడ్లీ తాబేళ్ల సంఖ్య తగ్గుతోందని తాబేళ్ల ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా, అటవీ శాఖ, స్వచ్ఛంద సంస్థలతో కలసి తాబేళ్లు గుంతల్లో పెట్టిన గుడ్లు సేకరించి, ప్రత్యేక స్థలంలో వాటిని భద్రపరచి, గుడ్ల నుంచి పిల్లలు వచ్చిన తర్వాత వాటిని సముద్రంలో వదిలి పెడుతుంటారు. ఈ క్రమంలో, సముద్ర తాబేళ్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా గిండి చిల్డ్రన్స్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం ఏర్పాటుకానుంది. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ... గిండి చిల్డ్రన్స్ పార్క్‌లో తాబేళ్ల సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు 1.35 ఎకరాలు కేటాయించారని, ఈ కేంద్రం బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులతో నిర్మితమవుతుందని తెలిపారు. ఈ కేంద్రం ప్రధాన భవనం సముద్ర తాబేళ్ల ఆకారంలో రూపొందించనున్నామన్నారు. భవన నిర్మాణాలకు టెండర్లు ఆహ్వానించినట్లు, వాటిని ఖరారు చేసి త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

సొరంగ మార్గం పూర్తిచేసిన 'భవాని'



భవాని యంత్రానికి స్వాగతం పలుకుతున్న సీఎంఆర్ఎల్ అధికారులు

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేట స్టేషన్ నుంచి ఆర్.కే రోడ్డు స్టేషన్ వరకు మెట్రో సొరంగం పూర్తిచేసిన 'భవాని' యంత్రం మంగళవారం బయటకు వచ్చింది. ఈ మేరకు చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) తన ఎక్స్ పేజీలో... నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా చేపట్టిన రెండో విడత మెట్రో ప్రాజెక్ట్, మూడు మార్గాల్లో 118.9 కి.మీ ఏర్పాటుకానుంది. ఈ మార్గంలో సొరంగం, ఎత్తైన ఫ్లై ఓవర్ల మీదుగా మెట్రో రైళ్లు నడునున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో సొరంగం మార్గం మెట్రో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటివరకు 49 శాతం మేర పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో, రాయపేట స్టేషన్ నుంచి ఆర్కే రోడ్డు స్టేషన్ వరకు 910 మీటర్ల దూరం సొరంగం తవ్వే పనులను టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) 'భవాని' చేపట్టింది. భవాని సొరంగం తవ్వే పనులు విజయవంతంగా పూర్తిచేసి ఆర్కే రోడ్డు స్టేషన్ వద్ద బయటకు వచ్చింది. ఈ యంత్రానికి సీఎంఆర్ఎల్ (ప్రాజెక్ట్) డైరెక్టర్ టి.అర్జునన్, సీఎంఆర్ఎల్ జనరల్ మేనేజర్లు (అండర్ గ్రౌండ్) ఆంటోజోస్, రవిచంద్రన్ సహా అధికారులు స్వాగతం పలికారు.

వెదురు కుర్చీలు ... అలంకార తోరణాలు

● గోవాను తలపిస్తున్న 'మెరీనా'



వెదురుతో రూపొందించిన కుర్చీలు



అలంకార తోరణం

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైకు 'మెరీనా' ప్రధాన చిహ్నం. ప్రపంచంలో ఏ ప్రాంతంలో ఉన్నా ఈ ఒక్క పేరు చెన్నై చరిత్రను తెలియజేస్తోంది. ఎన్నో కలలతో నగరానికి వచ్చే వారికి అలలు, బీచ్‌లు ఆనందకరమైన జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. చారిత్రక నాయకులు విగ్రహాలు, 'కార్మికుల స్మారక స్థూపం' తదితరాలున్న మెరీనా, అనేక చారిత్రాత్మిక సమావేశాలకు అతిథ్యం ఇచ్చింది. అలాగే, పేదలు, సామాన్యులకు ఆహ్లాదం, వినోదాన్ని కలిగించే ప్రాంతంగానూ నిలిచింది. నిత్యం రద్దీగా కనిపిస్తున్న మెరీనా బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ సాధించేలా చెన్నై కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా పలు కార్యక్రమాలు చేపట్టాయి. పాదాలను తడిపే అలలను ఆస్వాదించిన వారు కూర్చునేందుకు వెదురు కుర్చీలు, గోవా లాగా పడుకుని సముద్రాన్ని ఆస్వాదించేలా సీట్లు, వెదురు పందిళ్లు ఏర్పాటయ్యాయి. పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక స్థలం, ఉపకరణాలున్నాయి. బీచ్‌కు వచ్చే ప్రజలు ఆహ్వానించేలా వెదురుతో అలంకార తోరణాలు, ప్రజలను పర్యవేక్షించేలా ఆధునిక ప్రమాణాలతో వెదురు వాచ్ టవర్లు నిర్మించారు. ఇసుకపై ఆధునిక నడక మార్గాలు, దివ్యాంగులకు ప్రత్యేక మార్గం, మరీ ముఖ్యంగా, వెదురుతో తయారుచేసిన టాయిలెట్లు కూడా ఉన్నాయి. అనేక మార్పులతో ఆధునికంగా మారుతున్న మెరీనాలో, పట్టణంబాక్కం వరకు విస్తరించిన ఆహార రెస్టారెంట్లకు నిలయంగా మారింది. చీకటిలో రంగురంగుల విద్యుద్దీపాల వెలుగుల్లో మెరీనా అందం పర్యాటకులను కట్టివేస్తోంది. మెరీనా అందం, ఆధునికతను దెబ్బతీయకుండా ఆస్వాదించడమే కీలకమని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు.

ఆర్‌సీఎం రూపాంత్రణ్ యాత్రకు అపూర్వ స్పందన

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అవసరమైన వస్తువుల తయారీలో పేరుగడించిన ఆర్‌సీఎం సంస్థ తన 25వ వార్షికోత్సవాల సందర్భంగా 'రూపాంత్రణ్' పేరుతో నిర్వహించిన యాత్రకు అపూర్వ స్పందన లభించిందని మంగళవారం ఉదయం మీడియా సమావేశంలో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సౌరబ్ చబ్రా తెలిపారు. నగరంలో ఈ యాత్ర ముగింపు సందర్భంగా తేనాంపేట కామరాజర్ అరంగంలో రక్తదాన శిబిరాలు, పుస్తకావిష్కరణ, ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు సత్కారం తదితర కార్యక్రమాలు కూడా నిర్వహించామన్నారు. ఈ వేడుకలలో సంస్థ సీఈఓ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌సీఎం యాత్ర ముగింపు వేడుకల్లో పాల్గొన్న సంస్థ నిర్వాహకులు

ఈశాన్యానికి ముందే... నిండుకుండలా జలాశయాలు

● సంవృద్ధిగా నీటినిల్వలు
● సముద్రం పాలుకానున్న అదనపు జలాలు



పూండి జలాశయం

పెరంబూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలు ప్రారంభానికి ముందే నగర జలాశయాల్లో నీరు సమృద్ధిగా ఉంది. ఈశాన్య వర్షాలతో జలాశయాలకు చేరే అదనపు జలాలు వృథాగా సముద్రంలోకి వదలాల్సిన పరిస్థితి ఏర్పడగా, లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు తప్పవని నిపుణులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో నివసించే 8 కోట్ల మంది ప్రజల్లో సుమారు కోటి మంది రాజధాని నగరం చెన్నై, శివారు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. నగరం, శివారు ప్రజలకు పూండి, చోళవరం, పుళల్, కన్నన్‌కోట తేర్వాయ్ కండిగై, చెంబరంబాక్కం, వీరాణం తదితర ఆరు జలాశయాల నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. గత ఏడాది ఇదే సమయంలో ఆరు జలాశయాల్లో 4,985.82 మిలియన్ ఘటనపుటడుగుల నీరు మాత్రమే ఉంది. ఈ ఏడాది నైరుతి పవనాలతో సమృద్ధిగా వర్షాలు కురవడంతో, ప్రస్తుతం ఆరు జలాశయాల్లో 9,824.35 మిలియన్ ఘనపుటడుగుల నీరుంది. అదే సమయంలో, ఆరు జలాశయాల పూర్తి సామర్థ్యం 13,222 మిలియన్ ఘనపుటడుగులు కాగా జలాశయాల్లో 3,397.65 మిలియన్ ఘనపుటడుగుల నీరు మాత్రమే నిల్వచేసే అవకాశముంది.

రెండు రోజుల్లో ఈశాన్యం...

రాష్ట్రంలో రాబోయే 48 గంటల్లో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశిస్తాయని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈశాన్య రుతుపవనాలతోనే రాష్ట్రంలో అధిక వర్షపాతం నమోదవుతోంది. ఆ ప్రకారం, నెల రోజుల పాటు వర్షాలు కురిస్తే నగర జలాశయాలు పూర్తిగా నిండే అవకాశముంది. అనంతరం కురిసే వర్షాలతో చేరే నీటిని వృధాగా సముద్రంలోకి వదలాల్సిన పరిస్థితి నెలకొంది. అదే సమయంలో, నగరం, శివారులోని లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యే ప్రమాదం కూడా లేకపోలేదు. మంగళవారం గణాంకాల ప్రకారం, పూండి జలాశయంలో 130.40 అడుగులు (పూర్తి సామర్థ్యం 140 అడుగులు), చోళవరం జలాశయంలో 51.22 అడుగులు (65.50), పుళల్ జలాశయంలో 48.92 అడుగులు (50.20), కన్నన్‌కోట తేర్వాయ్ కండిగై జలాశయంలో 113.08 అడుగులు (115.,35), చెంబరంబాక్కం జలాశయంలో 79.92 అడుగులు (85.40), వీరాణం జలాశయంలో 45.80 అడుగులు (పూర్తి సామర్థ్యం 47.50 అడుగులు) నీటి నిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

కార్పొరేషన్ పాఠశాలల్లో 'ఏవీవీ'లు


అడయార్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చెన్నై కార్పొరేషన్ పాఠశాలల విద్యార్థులకు సురక్షిత తాగు నీరందించాలనే ఆశయంతో ఆటోమేటిక్ వాటర్ వెండింగ్ (ఏవీవీ)మెషీన్లను అందుబాటులోకి తెచ్చారు. తాజాగా కీల్పాక్కం పుల్లా అవెన్యూ, మార్కెట్ వీధి, సైదాపేట ప్రాంతాల్లోని కార్పొరేషన్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వాటర్ మెషీన్లను మేయర్ ఆర్.ప్రియ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కుమరగురుబన్, జాయింట్ కమిషనర్ (ఎడ్యుకేషన్) కర్పగం, స్టాండింగ్ కమిటీ చైర్మన్లు, పాల్గొన్నారు. ఈ పథకాన్ని రూ.1.60 కోట్ల తో 16 కార్పొరేషన్ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నారు.



ఏవీవీ మెషీన్ ప్రారంభోత్సవంలో మేయర్ ప్రియ, తదితరులు

ఏర్కాడును కప్పేసిన మంచుదుప్పటి

● జిల్లుమంటున్న పర్యాటక ప్రాంతం



దట్టంగా కురుస్తున్న మంచు

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో 'పేదల ఊటీ'గా పేరొందిన ఏర్కాడు గత రెండు రోజులుగా గజగజ వణికిపోతోంది. ఆ ప్రాంతాన్ని మంచు దుప్పటి కమ్మేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సేలం జిల్లా అంతటా నాలుగు రోజులుగా భారీగా వర్షాలు కురిశాయి. తలైవాసన్, నత్తకరై తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం రెండు గంటలకు పైగా వర్షాలు కురిశాయి. ఇదే విధంగా ఏర్కాడు ప్రాంతంలో సోమవారం సాయంత్రం ప్రారంభమైన వర్షం అర్ధరాత్రి వరకూ కొనసాగింది. దీనితో మంగళవారం వేకువజామున ఏర్కాడు అంతటా దట్టమైన మంచు ఆవరించింది. చలి కూడా పెరగడంతో ప్రజలు గజగజ వణికారు.

ఆరోగ్య సంరక్షణలో ఫిజీషియన్ అసిస్టెంట్ల పాత్ర కీలకం

● ఐఏపీఏ సదస్సులో వక్తలు

చెన్నై, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణలో ఫిజీషియన్ అసిస్టెంట్స్ పాత్ర కీలకమని, సకాలంలో రోగులను కాపాడటంలోనూ ముందుంటారని నగరంలో జరిగిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్ అసిస్టెంట్స్ (ఐఏపీఏ) సదస్సు-2025లో పాల్గొన్న ప్రముఖులు పేర్కొన్నారు. ఈ సదస్సులో సంస్థ అధ్యక్షులు గోమతి సుందర్, కావేరి హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ కుమార్, ఫ్రాంటియర్ లైఫ్‌లైన్ హాస్పిటల్ ఉపాధ్యక్షులు డాక్టర్ సంధ్యా చెరియన్, ఎమ్మెల్యే డాక్టర్ ఎళిలన్ నాగనాథన్, మద్రాస్ మెడికల్ మిషన్ కార్డియో వాస్కులర్ సర్జరీ విభాగం అధ్యక్షుడు డాక్టర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ తరఫున ప్రచురించిన తొలి సంచికను ఎమ్మెల్యే ఎళిలన్ నాగనాథన్ ఆవిష్కరించారు. డాక్టర్ చెరియన్ జన్మదినమైన మార్చి 8వ తేదీ నేషనల్ ఫిజీషియన్ డేగా పాటించాలని తీర్మానించారు.



సంచికను ఆవిష్కరిస్తున్న సంస్థ అధ్యక్షులు గోమతి సుందర్ తదితరులు

ఫీనిక్స్ మార్కెట్ సిటీలో 'యూరోపియా'

అడయార్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలోని ఫీనిక్స్ మార్కెట్ సిటీలో 'యూఫోరియా-2025' పేరుతో 'ఏ సెలబ్రేషన్ ఆఫ్ సార్ప్ దివాలీ బాష్' వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఫ్యాషన్, సంగీతం, థియేటర్, కళలు ఇలా అన్ని అంశాలను ఒకే గొడుగు కిందకు తెచ్చేలా ఈ ఈవెంట్ నిర్వహించారు. ఇందులో దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన ఫ్యాషన్ మాస్ట్రో ప్రసాద్ బిదపా క్యూరేట్ చేసిన గ్రాండ్ ఫ్యాషన్ షోకేస్‌ను మోడల్స్ ప్రదర్శించారు. పేరొందని ఫ్యాషన్ డిజైన్లను ధరించిన మోడల్స్ ర్యాంప్‌వాక్ చేశారు. ముఖ్యంగా డీజిల్, అర్మానీ, కాల్విన్ క్లైన్, బ్రూక్స్ బ్రదర్స్, రీతు కుమార్, తస్వా, మాన్యవర్, కళానికేతన్, కోస్కి, మలబార్ జ్యూవెలర్స్ వంటి లేబుల్స్ ధరించి ప్రదర్శించారు. అలాగే, బాలీవుడ్ సింగర్ డినో మోరియా నేపథ్యగానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. దీనిపై సెంటర్ డైరెక్టర్, ఫీనిక్స్ మాల్ ఆఫ్ ఆసియా అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ (సౌత్) రీతు జై మెహతా మాట్లాడుతూ, తమ మాల్‌లో ఈ తరహా ఈవెంట్స్‌ను ఎన్నో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. యుఫోరియా ఫ్యాషన్, కల్చర్, వినోదం వంటి అంశాల సమ్మేళనంగా నిర్వహించినట్టు పేర్కొన్నారు.



మోడళ్లతో కలిసి నేపథ్యగానం చేస్తున్న సింగర్ డినో మోరియా



శ్రీవారిసేవలో ప్రముఖులు

గౌతమ్ సింఘానియా - మధుర్ భండార్కర్ - సావిత్రి బాలసుబ్రహ్మణ్యం

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రేమాండ్స్ గ్రూప్ చైర్మన్, ఎండీ గౌతమ్ సింఘానియా, బాలీవుడ్ చిత్ర దర్శకుడు, నిర్మాత, రచయిత మధుర్ భండార్కర్, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఏపీ ఎన్జీవో ప్రెసిడెంట్ విద్యాసాగర్, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సతీమణి సావిత్రి బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అహ్మదాబాద్ సదస్సుకు తిరుపతి మేయర్



తిరుపతి(జీవకోన), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో బుధ, గురువారాల్లో జరగనున్న మేయర్ల జాతీయ శిఖరాగ్ర సమావేశానికి తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషకు ఆహ్వానం అందింది. ఈ మేరకు అహ్మదాబాద్ నగరపాలక సంస్థ ఆహ్వానం పంపారు. నేషనల్ అర్బన్ కాంక్లేవ్ అండ్ మేయోరల్ సమ్మిట్ ఫర్ షేపింగ్ ఫ్యూచర్ ఆఫ్ సిటీస్ పేరుతో ఈ సమావేశం జరగనుంది. మాజీ ఉపప్రధాని సర్దార్‌వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఈసమావేశం ఏర్పాటు చేశారు. అహ్మదాబాద్‌లోని ఈ మున్సిపాలిటీకి 1924 నుంచి 1928 వరకు పటేల్ అధ్యక్షుడిగా పనిచేశారు. అందుకే ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశానికి మేయర్ శిరీష వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.93 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,569

తలనీలాలు సమర్పించినవారు: 27,482



ఈ పరీక్షలు ఇక ఈజీ

- ప్రభుత్వమే సమకూర్చనున్న జవాబు పత్రాలు
- అసెస్‌మెంట్ బుక్‌లెట్లతో విద్యార్థులకు తప్పిన భారం
- ప్రగతి, సామర్థ్యం తెలుసుకునేందుకు అవకాశం



తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పాఠశాల పరీక్షల నిర్వహణలోనూ వినూత్న విధానానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను, పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. 1నుంచి 10తరగతుల విద్యార్థులు ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షలను ఇక బుక్‌లెట్లలోనే రాయల్సి ఉంటుంది. ఇప్పటివరకూ ఫార్మేటివ్ అసెస్‌మెంట్, సమ్మిటివ్ అసెస్‌మెంట్ విధానాల్లో పరీక్షలు నిర్వహించేవారు. విద్యార్థులు సొంత ఖర్చుతోనే జవాబు పత్రాలు తెచ్చుకోవాల్సి వచ్చేది. దిద్దిన తర్వాత ఉపాధ్యాయులకు జవాబు పత్రాలను తీసి చూసే పరిస్థితి ఉండేది కాదు. ఈ లోపాలకు చెక్ పెడుతూ ప్రభుత్వం కొత్త పద్ధతిని అమలు చేస్తోంది.



అసెస్‌మెంట్ బుక్‌లెట్ కవర్‌పేజీ - ఓఎంఆర్ షీట్



విద్యార్థులకు ఉపయుక్తం : అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. విద్యార్థుల ప్రగతి సామర్థ్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని అభ్యసనా సామర్థ్యాలను మదింపు చేయడానికి ఉపయోగపడుతుంది. ఓఎంఆర్ షీట్లను అనుసంధానం చేయడంవల్ల విద్యార్థుల సామర్థ్యాన్ని సమగ్రంగా విశ్లేషించేందుకు అవకాశముంటుంది. విద్యార్థులకు ప్రభుత్వమే జవాబు పత్రాలను సమకూర్చడంతో విద్యార్థులకు ఇబ్బంది తప్పింది.

- బి. మురళీకృష్ణ, ఎస్టీయూ జిల్లా సహాధ్యక్షుడు

పరీక్షల్లో వినూత్న విధానం

విద్యాసంవత్సరంలో 4 ఫార్మేటివ్ అసెస్‌మెంట్లు, 2 సమ్మేటివ్ అసెస్‌మెంట్లు ఉంటాయి. ఈ పరీక్షలు రాయడానికి ప్రభుత్వమే 72 పేజీల బుక్‌లెట్ల రూపంలో విద్యార్థులకు జవాబు పత్రాలను సమకూర్చుతోంది. బుక్‌లెట్ విధానం వల్ల మూల్యాంకనం తరువాత జవాబు పత్రాలు మూలన పడేసే పరిస్థితి ఉండదు. ఒక ఎఫ్ఏకి, మరో ఎఫ్ఏకి మధ్య విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాల్లో ఎలాంటి మార్పులొచ్చాయో ఉపాధ్యాయులు పరిశీలించే అవకాశం ఉంటుంది. ఏదేని జవాబుకు సున్నా మార్కులు వేసినా, మార్కులు తగ్గించినా కారణాన్ని టీచర్ రాయాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థులు పొరపాటును దిద్దుకునే వెసులుబాటు ఉంటుంది. ఇప్పటికే ఒకసారి ఈ పద్ధతి కింద పరీక్షలు రాశారు.

బుక్‌లెట్లు వేర్వేరుగా ఇవ్వాలి



ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్లకు ఒకే అసెస్‌మెంట్ బుక్ ఇచ్చారు. ఇలాకాకుండా వేరువేరు బుక్‌లెట్లుగా ఇవ్వాలి. కాన్ఫరెన్సులు, యాప్‌ల పనిభారంవల్ల మూల్యాంకనం చేసేందుకు సమయం ఉండటంలేదు. ఇప్పటి వరకూ జవాబు పత్రాలను ఇంటికి తీసుకెళ్లి మూల్యాంకనం చేస్తున్నాం. ఇప్పుడు పెద్ద పరిమాణంలో ఉన్న అసెస్‌మెంట్ బుక్స్‌ను తీసుకెళ్లడం ఇబ్బందిగా ఉంది. వేరువేరుగా బుక్‌లెట్లను ఇస్తే కొంత వెసులుబాటుగా ఉంటుంది. వచ్చే ఏడాదినుంచి అలాగే చేస్తామని మంత్రి లోకేష్ మాట ఇచ్చారు.

- శవన్నగారి బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

- రూ.6 లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్ గడ్డం రవికి ఐదేళ్ల పాటు జైలు శిక్ష విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. అన్నమయ్య జిల్లా కలకడ మండలం ముడియంవారిపల్లికి చెందిన గడ్డం రవి, కడప జిల్లా రాసపల్లికి చెందిన రాగి మహేష్, శివయ్య, నగేష్, టి.సుండుపల్లికి చెందిన మల్లికార్జున 2018లో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం మొక్కలు నరికి అక్రమంగా తరలిస్తుండగా ఫారెస్ట్ అధికారులకు పట్టుబడ్డారు.వారి నుంచి9 దుంగలు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా ఈ కేసును రాష్ట్ర స్థాయి ఎర్రచందనం కోర్టు విచారించింది. నిందితుల్లో గడ్డం రవికి ఐదేళ్ళ జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మిగిలిన నలుగురిపై సాక్ష్యాధారాలు నిరూపణ కాకపోవడంతో నిర్దోషులుగా ప్రకటించినట్లు లైజన్ అధికారి శ్రీనివాసులు చెప్పారు.

శ్రీసిటీని సందర్శించిన బెల్జియం కాన్సుల్ జనరల్



బెల్జియం కాన్సుల్ జనరల్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

సత్యవేడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బెల్జియం కాన్సుల్ జనరల్ ఫ్రాంక్ గీర్కెన్స్ అధికారుల బృందంతో బుధవారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ చైర్మన్ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. కాన్సుల్ జనరల్‌తో చర్చల సందర్భంగా పారిశ్రామిక అభివృద్ధి గురించి వివరించిన రవీంద్ర సన్నారెడ్డి 31 దేశాలకు చెందిన 240కి పైగా పరిశ్రమలు ఇక్కడ స్థాపించాయని తెలిపారు. విభిన్న రంగాలలో పెట్టుబడి అవకాశాల కోసం అన్వేషిస్తున్న కంపెనీలకు శ్రీసిటీ అత్యంత విలువైన గమ్యస్థానం అన్నారు. పర్యటనలో భాగంగా కాన్సుల్ జనరల్ శ్రీసిటీ పరిసరాలను సందర్శించారు. శ్రీసిటీ వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విదేశీ పెట్టుబడిదారులకు ఇది అత్యంత అనువైన ప్రదేశం అని వ్యాఖ్యానించారు. వెర్మీరన్ సంస్థ అధునాతన వీల్ చైర్లు తయారు చేయడం ద్వారా బెల్జియం పరిశ్రమలకు శ్రీసిటీలో పునాది వేసిందని ప్రశంసించారు. ప్రపంచ స్థాయి పునరావాస పరికరాల తయారీ సంస్థ వెర్మీరన్ పరిశ్రమ శ్రీసిటీలో ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్న రవీంద్ర సన్నారెడ్డి గ్లోబల్ భాగస్వామ్యాలను ప్రోత్సహించాలనే శ్రీసిటీ నిబద్ధతను ప్రతిబింబిస్తోందని తెలిపారు. అనంతరం వెర్మీరన్ పరిశ్రమను పార్క్ గీర్కెన్స్ సందర్శించి, అక్కడ ఉత్పత్తులు, ఇతర పారిశ్రామిక కార్యకలాపాలను పరిశీలించారు. ఆయనతో పాటు బెల్జియంలోని ఫ్లాండర్స్ రీజియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ జయంత్ నడిగర్ వెర్మీరన్ ఎండీ సయ్యద్ రియాజ్ ఖాద్రీ పాల్గొన్నారు.

ఆ రోజు మీ వాణి ఏమైంది?

- టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసేలా కల్పిత విమర్శలొద్దు
- నిజా నిజాలపై చర్చకు సిద్ధమా?
- భూమనపై ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడి ఆగ్రహం



మాట్లాడుతున్న శ్రీనివాసనంద సరస్వతి

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 'విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో వెండి సింహాలు మాయం. అంతర్వేదిలో రథాలు దహనం. పిఠాపురంలో దేవాలయాల మీద దాడులు.. దేవతా విగ్రహాలు ధ్వంసం. శ్రీవారికి సీఎం హోదాలో జగన్ సతీసమేతంగా ఏనాడైనా పట్టువస్త్రాలు సమర్పించారా.. డిక్లరేషన్‌పై సంతకం చేశారా.. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా నాడు జరిగిన సంఘటనలపై భూమన కరుణాకరెడ్డి వాణి ఏమైంది' అంటూ ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి నిలదీశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ, నాస్తికుడైన భూమన హిందూ సమాజానికి ప్రతినిధిగా ప్రచారం చేసుకుంటూ తిరుమలలో ఏదో జరిగిపోతోందని టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసేలా కల్పిత విమర్శల చేయడం మానుకోవాలన్నారు. శిల్పి చెక్కి భిన్నమైపోయిన విగ్రహం ఏ దేవతామూర్తిదో తెలియకుండా విష్ణుమూర్తి అంటూ విమర్శలు చేయడం చూస్తుంటే కనీస అవగాహన లేకుండా టీటీడీ చైర్మన్‌గా ఏలా పనిచేశావో అంతుపట్టడం లేదన్నారు. టీటీడీ చైర్మన్‌గా భక్తుల గురించి పట్టించుకోకుండా అవినీతి, అక్రమాలు తదితర వ్యవహారాలతో తిరుమల కొండను అపవిత్రం చేసినప్పుడు కరుణాకరరెడ్డిలోని సనాతనవాది ఏమయ్యారని ప్రశ్నించారు. తిరుమల కొండపై చేసిన అపవిత్రాలతోనే వైసీపీ 11 సీట్లతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. టీటీడీలో ప్రస్తుతం జరుగుతున్న మంచి కార్యక్రమాలను చూసి ఓర్వలేక పనిగట్టుకుని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. టీటీడీలో నాడు, నేటి పరిస్థితులు, ఆయన చేసిన నిరాధార ఆరోపణలపై చర్చకు రావాలని భూమనకు పిలుపునిచ్చారు. ఇలాంటి ఆరోపణలు మానుకోకపోతే గుణపాఠం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాధు పరిషత్ సభ్యులు శివానంద స్వామి, గణేష్ స్వామి, ఓంకార్, నీలకంఠ, అరుణ్, మునిబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో కల్తీ మద్యమని ప్రచారం

- అవన్నీ తప్పుడు వార్తలుగా నిర్ధారించిన అధికారులు
- ఇద్దరు వైసీపీ కార్యకర్తల అరెస్టు



ఇద్దరు నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కల్తీ మద్యం ఉందని, ప్రజలకు భద్రత ఎక్కడ ఉందంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ప్రచారం చేసిన ఇద్దరు వైసీపీ కార్యకర్తలను ఈస్ట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి తెలిపిన ప్రకారం.. తిరుపతి వైసీపీ సోషల్ మీడియా సభ్యుడు బ్రుంగి నవీన్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం వ్యక్తిగత సహాయకుడు చంద్రశేఖర్ వెంకటేష్ కలిసి ఈ నెల 7న 'అట్‌దిరేట్ ఆఫ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ- తిరుపతి' అనే ఇన్‌స్టాగ్రామ్ అకౌంటు ద్వారా 'తిరుపతిలో మద్యం కలకలం.. ప్రజల భద్రత ఎక్కడ' శీర్షికతో వీడియో పోస్టు చేశారు. 11న తిరుపతిలో ఎన్ బ్రాండ్ మద్యం తాగి అపస్మారక స్థితిలో వ్యక్తి అంటూ ఆ పార్టీ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. ఈ నెల 13న కపిలతీర్థం సర్కిల్ ప్రాంతానికి సంబంధించిన వీడియోలో తిరుపతిలో మద్యం తాగి పడి పోయిన వ్యక్తి అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. వీటిపై విచారణ చేసిన తిరుపతి అర్బన్ ఎక్సైజ్ సీఐ రామచంద్ర.. అవి తప్పుడు పోస్టులని, ప్రజలను తప్పుదారి పట్టించేవని ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు హేమాద్రి, నాగార్జున రెడ్డి విచారించారు. సోషల్ మీడియా ద్వారా నిరంతరం తప్పుడు పోస్టులు పెడుతున్నట్లు సీసీ ఫుటేజీలు, వీడియో షేరింగ్ టైమ్, వాట్సాప్ కాల్ రికార్డులు పరిశీలించి కేసు నమోదు చేశారు. ఆ ఇద్దరిని అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా, రిమాండు తిరస్కరించారు. 41 నోటీసు ఇచ్చి పంపించారు.

మెడికల్ కాలేజీలపై జగన్ విష ప్రచారం

- 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్



తిరుపతి(కల్చరల్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జగన్ నిర్లక్ష్యం చేసిన వైద్యరంగాన్ని పీపీపీ పద్ధతి ద్వారా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పిస్తే జగన్ అండ్ కో ఓర్వలేక విషపూరిత ప్రచారాలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం పర్యటనలో జగన్ తీరుచూస్తే మానసిక స్థితి కోల్పోయినట్లు కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలలకు కేంద్ర ప్రభుత్వ వాటా తప్ప నాడు జగన్ ప్రభుత్వం రాష్ట్ర వాటాను ఎక్కడా వెచ్చించలేదన్నారు. వివిధ దశల్లో నిర్మాణాలను నిలిపేసి ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ మెడికల్ కాలేజీలకు పూర్వవైభవం తీసుకురావాలనే ప్రయత్నాలకు అడ్డుతగులుతూ రాద్ధాంతం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మెడికల్ కాలేజీల విషయంలో కూటమి ప్రభుత్వం గత నిబంధనల మేరకే నడుచుకుంటోందన్నారు. ప్రైవేటు పరం చేస్తున్నారనే మాట వాస్తవం కాదన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు, నాయకులు నరేష్, బీడీ బాలాజీ, ప్రశాంతి, నవీన్, నరేంద్రరెడ్డి, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల హంగామా

- రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అటెండర్‌పై దౌర్జన్యం



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అటెండర్‌పై డాక్యుమెంట్ రైటర్ల దౌర్జన్యం

రేణిగుంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు హంగామా సృష్టించారు. కార్యాలయ అటెండర్ తిరుమలేశుపై దౌర్జన్యం చేశారు. లంచం విషయమై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అటెండర్‌కు, డాక్యుమెంట్ రైటర్ల నడుమ తలెత్తిన వివాదం మంగళవారం మధ్యాహ్నం గందరగోళ పరిస్థితికి దారితీసింది. డాక్యుమెంట్ రైటర్ల జిల్లా అధ్యక్షుడు బుజ్జి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంటకు చెందిన డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వద్దకు చేరుకుని అటెండర్ తిరుమలేశుపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సమయంలో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అటెండర్‌పై డాక్యుమెంటు రైటర్లు, వారితోపాటు వచ్చిన ప్రైవేటు వ్యక్తులు దౌర్జన్యానికి దిగారు. దీంతో కార్యాలయంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఇరువర్గాల నడుమ వాగ్వాదం తారస్థాయికి చేరి ఏం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి చోటుచేసుకుంది. కొంత సేపటికి స్పందించిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ అందరూ బయటకు వెళ్లిపోవాలని చెబుతూనే అటెండర్‌ను నెట్టివేయడం విమర్శలకు దారితీసింది. ఇదిలా ఉండగా క్రయవిక్రయాలకు వచ్చే పార్టీల వద్ద దస్తావేజుల, రిజిస్ట్రేషన్ ఇతర విషయాలు సబ్ రిజిస్ట్రార్‌తో మాట్లాడుతామని తమను కార్యాలయంలోకి రావద్దని, పార్టీలతో లోపల మాట్లాడవద్దని చెప్పడానికి అటెండర్‌కు హక్కు లేదని డాక్యుమెంట్ రైటర్లు చెబుతున్నారు. ఇప్పటికే రెండు రోజులుగా సాగుతున్న ఈ వివాదంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు స్తంభిస్తున్నాయి. అటెండర్‌పై చర్యలు తీసుకోకపోతే తాము డాక్యుమెంట్లు రూపొందించకుండా షాపులు మూసివేస్తామని రైటర్లు హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి పరిస్థితులను చక్కబెట్టడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రేపటి నుంచీ ఎస్వీయూలో యువ తరంగ్-2025



యువ తరంగ్-2025 లోగో

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో ఈ నెల 16 నుంచీ యువ తరంగ్-2025 నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం చేపట్టింది. సంగీత, నృత్య సంబంధమైన సుమారు 30 అంశాల్లో పోటీలు ఉంటాయి. యూనివర్సిటీ అనుబంధ కాలేజీల నుంచీ 40 కళా బృందాలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. 16వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో యువ తరంగ్-2025 ప్రారంభం కానుంది. శాప్ చైర్మెన్ రవినాయుడు, వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రారంభిస్తారు. ఈ మేరకు స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ తెలిపారు.

కౌశల్ సైన్స్‌క్విజ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో కేవీఎన్ కుమార్, భానుప్రసాద్ తదితరులు

తిరుపతి(విద్య), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ పిలుపునిచ్చారు. కౌశల్ జిల్లా కోఆర్డినేటర్‌తో ధనుంజయ్‌తో కలిసి మంగళశారం ఆయన తన చాంబర్‌లో సైన్స్ క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారతీయ విజ్ఞానమండలి, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త నిర్వహణలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు ఈ ఏడాది తిరుపతిలో జరుగుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు bvmap.org లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 7032889880 సెల్‌ఫోన్ నంబర్‌లో జిల్లా కౌశల్ కోఆర్డినేటర్ డి. ధనంజయులును లేదా 8919387388 సెల్ నంబర్‌లో అడిషనల్ కోఆర్డినేటర్ టి. తులసిని సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో కౌశల్ జిల్లా అడిషనల్ కోఆర్డినేటర్ టి. తులసి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజిలెన్స్ జమేదార్ దురుసుతనం


తిరుచానూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఓ భక్తురాలిపై ఆలయ మహిళా జమేదార్ చేయి చేసుకున్నారు. వివరాలిలా.. మంగళవారం చెన్నై నుంచి ఆండాల్ అనేహిజ్రా పద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చింది. సన్నిధి వద్ద ఈమెపై మహిళా జమేదార్ దురుసుగా ప్రవర్తించింది. ఈ క్రమంలో వాగ్వాదం పెరగడంతో జమేదార్ భక్తురాలి ముఖంపై చేయి చేసుకుంది. దీంతో ఆమె అక్కడి అధికారులకు ఫిర్యాదుచేసింది. వారు సర్దిచెప్పారు. హుండీ వద్ద కూడా బాధితురాలిపై సదరు జమేదారు మరోసారి దురుసుగా ప్రవర్తించింది. ఆలయం వెలుపల బాధితురాలు విలపించడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. గతంలో కూడా ఈ జమేదారు ఇదే తరహాలో వ్యవహరించడంతో ఆలయం నుంచి బదిలీ చేశారు. కొన్ని రోజులకే ఓ విజిలెన్సు అధికారి సహకారంతో ఈమె తిరుచానూరులో విధులు నిర్వహిస్తోంది.

బదిలీ అయిన అధికారులకు వీడ్కోలు



శుభం బన్సల్‌కు శ్రీవారి జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా జేసీగా పనిచేసి బదిలీపై వెళుతున్న శుభం బన్సల్ సేవలు ఎనలేనివని కలెక్టర్ వెంకటేశ్వర్ కొనియాడారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో పరిశ్రమల డైరెక్టర్‌గా బదిలీపై వెళుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాలకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులిద్దరూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించారన్నారు. శుభం బన్సల్ మాట్లాడుతూ శ్రీవారు కొలువై ఉన్న తిరుపతిలో పనిచేసినందుకు సంతోషంగా ఉందన్నారు. డీఆర్వో నరసింహులు మాట్లాడుతూ ఏపీఐఐసీ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, 22ఏ పెండింగ్ విషయాల్లో జాయింట్ కలెక్టర్ సేవలు మరువలేనివన్నారు. శుభం బన్సల్, రాఘవేంద్రమీనాలను జిల్లా అధికారులు ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. నగర పాలకసంస్థ కమిషనర్ మౌర్య, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బదిలీపై వెళుతుండటంతో బాధ్యతలను కలెక్టర్ పర్యవేక్షించనున్నారు.



సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాను సత్కరిస్తున్న కలెక్టర్

ఇన్‌సర్వీస్ బీఈడీ అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ దూరవిద్య ఇన్ సర్వీసు బీఈడీ కోర్సులో సీటు పొందిన అభ్యర్థుల జాబితా విడుదలైంది. బీఈడీ, స్పెషల్ బీఈడీ, బీఈడీ అడిషనల్ మెథడాలజీ కోర్సుల్లో ప్రవేశానికి 2, 500 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 500 మందికి సీట్లు కేటాయించారు. మార్కులు, ఎక్స్‌పీరియన్స్, రోస్టర్‌ను అనుసరించి ఎంపిక చేశారు. సీటు పొందిన వారు రూ. 24, 500 ఫీజును ఆన్‌లైన్ ద్వారా బుధవారం చెల్లించాలని దూరవిద్యా డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ తెలిపారు.